సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 26 । జూన్ । 2025



ఆ నేరం మాది కాదు!
మున్సిపాలిటీ, మిషన్ భగీరథ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఇల్లెందు పట్టణ వాసులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. 8లో



నిబంధనలకు విరుద్ధంగా..
నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం
జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆగని అరెస్టులు

సింగరేణి మెడికల్ బోర్డులో బదిలీలు, డిప్యుటేషన్లను ఆధారంగా చేసుకుని ఇంత కాలం దందాకు పాల్పడిన వ్యక్తులు ఒక్కొక్కరుగా వెలుగులోకి వస్తున్నారు. ఈ అంశంపై ఏసీబీ సీరియస్‌గా దృష్టి పెట్టడంతో ఆరు నెలల్లో ముగ్గురు అరెస్టయ్యారు. రాబోయే రోజుల్లో మరికొందరిని సైతం అదుపులోకి తీసుకునేందుకు ఏసీబీ సిద్ధమవుతోందని సమాచారం.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సింగరేణిలో అవినీతి దందాపై ఏసీబీ నజర్

- కార్పొరేట్ కార్యాలయానికీ అంటుతున్న మరకలు
- 40 రోజుల్లో మూడు చోట్ల దాడులు
- ఏసీబీ చేతికి కీలక సమాచారం, మరిన్ని దాడులకు అవకాశం!



భూపాలపల్లి ఏరియాలో ఓ కార్మికుడి ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

కార్పొరేట్ ఆఫీస్ అడ్డాగా..
తెలంగాణలో భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సింగరేణి గనులు విస్తరించి ఉన్నాయి. సుమారు 40 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. బొగ్గు వెలికితీతలో సంస్థకు వందేళ్ల చరిత్ర ఉండగా ఇటీవల థర్మల్, సోలార్ విద్యుత్ రంగంలోనూ అడుగు పెట్టింది. సంస్థ పరిధిలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం, నియామకాలు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియ అంతా కొత్తగూడెంలోని కార్పొరేట్ ఆఫీస్ వేదికగా జరుగుతుంటాయి. అయితే ఇక్కడ గతంలో పని చేసిన ఓ వ్యక్తి తనకు ఉన్నతాధికారుల వద్ద పలుకుబడి ఉందంటూ కార్మికులను నమ్మించాడు. ఆ తర్వాత బదిలీలు, డిప్యుటేషన్లు, మెడికల్ బోర్డు ద్వారా వారసత్వ ఉద్యోగాలు ఇప్పించడం వంటి పనులు చేయించగలనంటూ నమ్మబలికాడు. అందుకు తగ్గట్టే నాలుగైదేళ్ల క్రితం వరకు సదరు ఉద్యోగి మాట సంస్థలో చలామణి అయింది. అయితే చివరకు సంస్థ ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించింది. అయినప్పటికీ డిప్యుటేషన్లు, బదిలీలు, మెడికల్ బోర్డు వ్యవహారంపై తరచూ అవినీతి ఆరోపణలు రావడంపై దృష్టి సారించింది.

ఇతరుల సంగతేంటి?
కార్మికుల సంక్షేమం విషయంలో కార్మిక సంఘాలు గతంలో రాజీలేకుండా పని చేశాయి. కానీ గత పదేళ్లలో కారుణ్య నియామకాలు మొదలైన తర్వాత కార్మిక సంఘాల కంటే ఖద్దరు నేతల పెత్తనం పెరగడం మొదలైంది. ఆ తర్వాత ఈ విష సంస్కృతి బదిలీలు, డిప్యుటేషన్లకు విస్తరించింది. ఎవరు పడితే వారు కాసులిస్తే చాలు సింగరేణిలో పనులు చక్కబెడతామని ప్రచారం చేసుకోవడం ప్రారంభమైంది. మొదట్లోనే ఈ విధానాలకు అడ్డుకట్ట వేయకపోవడంతో ఈ వ్యవహారం శృతి మించింది. చివరకు విజిలెన్స్‌తో పని కావడం లేదని ఏసీబీని రంగంలోకి దించారు. మెడికల్ బోర్డులోకి ఆర్మీ డాక్టర్‌ను తీసుకురావాలనే ప్రతిపాదనను పరిశీలించాల్సి వచ్చింది. అంతేకాదు.. బదిలీలు, డిప్యుటేషన్ల విషయంలో అవినీతిని అరికట్టేందుకు కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చారు. ఈ అంశంపై ఆరు నెలలుగా నిర్విరామంగా దృష్టి పెట్టడంతో ఒక్కొక్కరుగా ఏసీబీకి చిక్కుతున్నారు. అయితే ప్రస్తుత విచారణ అంతా గతంలో సంస్థలో పని చేసిన ఓ వ్యక్తి, అతని కోటరీకి సంబంధించిన సింగరేణి ఉద్యోగులు/వ్యక్తుల కేంద్రంగానే సాగుతోందనే విమర్శ ఉంది. బదిలీలు, మెడికల్ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలంటే ఈ కాసుల దందాతో సంబంధం ఉన్న అందరిపైనా దృష్టి సారించాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు. కాగా, సంస్థలో జరుగుతున్న అవినీతి వివరాలు తెలిపేందుకు ప్రత్యేకంగా 94911-44104 నంబర్‌ను సింగరేణి అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఫోన్ చేయడం లేదా వాట్సాప్ ద్వారా వివరాలు అందించొచ్చని తెలిపారు.

ఒక్కొక్కరుగా..
లిఖిత పూర్వకంగా, ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఈమెయిళ్ల ద్వారా అందిన సమాచారానికి తోడు సంస్థలో ఉన్నతాధికారులు ఇచ్చిన నమ్మకమైన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ ఏడాది మే 6న కొత్తగూడెంలోని మెయిన్ వర్క్‌షాప్‌లో పని చేస్తున్న అన్నెబోయిన రాజేశ్వరరావు అనే ఉద్యోగిని ఏసీబీ అధికారులు విచారించారు. తిరిగి జూన్ 6న ఇదే అంశంపై కొత్తగూడెం నివాసి, సంస్థతో సంబంధం లేకపోయినా సింగరేణి వ్యవహారాల్లో కీలకంగా మారిన ఓ మహిళనూ విచారించారు. తాజాగా భూపాలపల్లి ఏరియాలోని కాకతీయ ఖని 1 ఇంక్లైన్‌లో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న ఎస్. ప్రశాంత్ అనే ఉద్యోగిని ఏసీబీ విచారణ చేస్తోంది. భూపాలపల్లి విచారణలో కీలక అంశాలు లభించాయని, వాటి ఆధారంగా త్వరలో కొత్తగూడెం ఏరియాలో మరికొందరిని కూడా విచారించే అవకాశం ఉంది.

పరిశ్రమలతోనే ఆర్థిక ప్రగతి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



డిగ్రీ కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులను ప్రోత్సహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌శర్మతో కలిసి నిర్వహించిన టీజీ ఐపాస్, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలమని, దీంతో పరిశ్రమల స్థాపనకు పలువురు ముందుకొస్తున్నారని అన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరికీ సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ , మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు అవసరమైన శిక్షణ అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో బయోచార్, ఏబీసీడీ డ్రైవ్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు, నవభారత్ లిమిటెడ్ వారు సమన్వయంతో ఉపాధిహామీ పథకం ద్వారా ఇటుకలతో వర్క్‌షెడ్లు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఐటీఐ విద్యార్థులకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తిరుపతయ్య, ఎల్‌బీఎం రాంరెడ్డి, గిరిజన సంక్షేమాధికారి అనసూయ, ఉపాధి కల్పన శాఖాధికారి శ్రీరామ్, భూగర్భ జల శాఖ ఏడీ రమేష్, మైనింగ్ ఏడీ దినేష్ పాల్గొన్నారు.

మునగపై పర్యవేక్షణ ఉండాలి
నవంబర్, డిసెంబర్ నెలల్లో నాటిన మునగ తోటలు ప్రస్తుతం పూత, కాత దశలో ఉంటాయని, సరైన పర్యవేక్షణ లేకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని కలెక్టర్ పాటిల్ ఒక ప్రకటనలో సూచించారు. వర్షాకాలంలో తోటల్లో నీరు నిల్వకుండా చూడాలని, ఉపాధి హామీ పథకం ద్వారా నీటి గుంతలు నిర్మించుకోవాలని తెలిపారు. పుష్ప తృప్తి, కాత దశలో పశువుల ఎరువు (5–10 కేజీలు), యూరియా (100 గ్రా), పొటాష్ (50గ్రా) మొక్కలకు వేయాలని, ప్రతీ వారం కలుపు తొలగించాలని సూచించారు. రైతులు ఈ సూచనలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించొచ్చని పేర్కొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలి..
పాల్వంచరూరల్ : అవసరాలకు వినియోగించే నీరు బయటకు రాకుండా ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని మురుగునీరు కళాశాలలోకి వస్తోందని ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలెక్టర్ దృష్టికి తేగా.. ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎక్కడికక్కడ ఇంకుడు గుంతలతో పాటు యూకలిప్టస్, వెదురు మొక్కలు నాటాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, ఏపీఓ పొరండ్ల రంగా, ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతే ప్రధానం..
కొత్తగూడెంఅర్బన్: అంటువ్యాధుల నివారణలో చేతుల పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని, దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉపాధ్యాయులకు సూచించారు. డయేరియా నివారణపై బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, సురక్షిత తాగునీటిని అందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.విద్యా చందన, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, డీఎంహెచ్ఓ భాస్కర్, డీసీహెచ్ఎస్ రవిబాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్.జయలక్ష్మి, సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా, ప్రోగ్రామ్ ఆఫీసర్లు తేజశ్రీ, కోరా శ్రీ యాదవ్, సీహెచ్ఓ నాగభూషణం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: జాతీయ సాహస అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వారు అందించే జాతీయ సాహస అవార్డులు – 2024 కోసం ఆన్‌లైన్‌లో పోర్టల్ https:// awards. gov. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూమి, ఆకాశం, సముద్రంపై సాహస యాత్రలు చేసిన వారిలో ఒక్కో విభాగంలో ఒకరికి అవార్డు అందిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో సాహసం చేసి, విజయం సాధించిన యువతీ, యువకులు ఈనెల 30వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను తిరస్కరిస్తామని తెలిపారు. 2022 నుంచి 2024 వరకు సాహసాలు చేసిన వారి దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారని వివరించారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి

బెటాలియన్ సిబ్బందికి డీఐజీ సన్నీ ఆదేశం



మొక్క నాటిన డీఐజీ సన్నీ, బెటాలియన్ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: బెటాలియన్ పోలీసులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని బెటాలియన్స్ డీఐజీ సి.సన్నీ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ బెటాలియన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బెటాలియన్ పోలీసుల విధి, విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశాక ఆవరణలో మొక్కలు నాటారు. శరత్ మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన నేత్ర పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు డి.శ్రీనివాసరావు, హెచ్.అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

నియోనాటల్ వాహనంలో అధునాతన పరికరాలు

నేలకొండపల్లి: అధునాతన పరికరాలతో కూడిన నియోనాటల్ వాహనం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఈఎంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ వద్ద బుధవారం నియోనాటల్ వాహనంలో పరికరాల పనితీరుపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ జిల్లాకు తొలిసారిగా ఈ వాహనాన్ని కేటాయించగా అత్యాధునిక పరికరాలు, వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేకంగా నవజాత శిశువుల సంరక్షణకు ఈ వాహనం సమకూర్చారని చెప్పారు. కాగా, 108 అంబులెన్స్‌లు ఖమ్మం జిల్లాలో 21, భద్రాద్రి జిల్లాలో 28 ఉండగా, ఒక్కో వాహనంలో కనీసం నెలకు 120 ట్రిప్పుల ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆస్పత్రులకు తరలిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ అధికారి దుర్గాప్రసాద్, 108 సిబ్బంది అజీమ్, పుష్పలత పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రాణం పోశారు..



అనన్యకు పాఠం బోధిస్తున్న విజయనిర్మల

టేకులపల్లి : టేకులపల్లి మండలం దాసుతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక మూసివేస్తారనే ప్రచారం సాగగా.. ఇద్దరు విద్యార్థినులు చేరి బడికి ప్రాణం పోశారు. ఇక్కడ గతేడాది మూడో తరగతిలో ముగ్గురు, నాలుగో తరగతిలో ముగ్గురు విద్యార్థులు చదువుకున్నారు. ఈ సంవత్సరం అందులో నలుగురు టీసీ తీసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లారు. నాలుగో తరగతిలో అనన్య, ఐదో తరగతిలో ఝాన్సీ మాత్రమే మిగిలారు. వారు కూడా ప్రైవేట్ పాఠశాలకు వెళ్తామంటూ ఇంతకాలం బడికి రాలేదు. దీంతో విద్యార్థులు లేక పాఠశాల మూతపడుతుందనే ప్రచారం సాగింది. ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాఠశాల పేరుతో ప్రత్యేకంగా కరపత్రాలు ముద్రించిన ప్రధానోపాధ్యాయురాలు(సింగిల్ టీచర్) విజయనిర్మల.. ప్రభుత్వ స్కూళ్లలో సౌకర్యాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, మెరుగైన బోధనపై గ్రామంలో ప్రచారం చేశారు. గ్రామంలో 20 మంది బడీడు పిల్లలు ఉండగా అంతా ప్రైవేట్ స్కూళ్లపై మోజుతో అటే పంపించారు. దీంతో హెచ్ఎం మళ్లీ తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారికి నచ్చజెప్పడంతో నాలుగో తరగతి చదివే గుగులోత్ అనన్య అనే విద్యార్థిని బుధవారం పాఠశాలలో చేరింది. ఐదో తరగతికి చెందిన ఝాన్సీని కూడా గురువారం చేర్పిస్తామని బాలిక తల్లిదండ్రులు చెప్పారు. దీంతో మూసివేస్తారనే ప్రచారం జరిగిన పాఠశాలకు ప్రాణం పోసినట్టయింది.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

ఎస్పీ రోహిత్‌రాజు సూచన



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

సుజాతనగర్: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని, వాటితో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. మాదక ద్రవ్య రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యంగా తమ శాఖ కృషి చేస్తోందని, ఇందులో భాగంగా నిరంతరం విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని, వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు ప్రతాప్, రాయల వెంకటేశ్వర్లు, కరుణాకర్, శివప్రసాద్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రాము, కళాశాల చైర్మన్ అరికెల భాస్కర్, ప్రిన్సిపాళ్లు నాగరాజు, రామకోటేశ్వరరావు, ఎస్సై ఎం.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి, రవాణా సజావుగా సాగాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

మణుగూరు రూరల్ : వర్షాకాలం ప్రారంభమైనందున బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎలాంటి అంతరాయం వాటిల్లకుండా సజావుగా సాగేలా చూడాలని సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ) కొప్పుల వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం ఆయన స్థానిక జీఎం దుర్గం రామ్‌చందర్‌తో కలిసి మణుగూరు ఏరియాలో పర్యటించారు. ఓసీ, ఓసీ–2, ఓసీ–4, కేసీహెచ్‌పీ వద్ద పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. శ్రామిక శక్తిని, యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. వర్షాలకు ఓసీల్లో చేరే నీటిని బయటికి తరలించేందుకు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని, సామర్థ్యం గల మోటార్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పగిడేరులోని జియో థర్మల్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్, ఇంజనీర్ ఆర్. శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారులు టి.లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, డీజీఎం మధన్ నాయక్, మేనేజర్లు సురేష్‌కుమార్, రమణారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ సెక్యూరిటీ అధికారి నాగ రమేష్ పాల్గొన్నారు.

సీఐ మెడకు.. ఎన్ఆర్ఐ కేసు

- ఇల్లెందు సీఐ సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు
- ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ



సీఐ సత్యనారాయణ

ఇల్లెందు: ఓ ఎన్ఆర్ఐ దంపతుల మధ్య ఏర్పడిన వివాదం.. చివరకు ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ మెడకు చుట్టుకుంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తమ పట్ల సీఐ దురుసుగా ప్రవర్తించారంటూ ఎన్ఆర్ఐ నవీన్‌రెడ్డి తల్లిదండ్రులు మల్టీజోన్ -1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా.. సీఐని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా.. ఇల్లెందు కరెంటాఫీస్ ఏరియాకు చెందిన పి.నవీన్‌రెడ్డికి హైదరాబాద్‌లోని శంగిచెర్లకు చెందిన శ్రావ్యతో 2023 జూన్‌లో వివాహం జరిగింది. కొంత కాలం పాటు అమెరికాలోని డల్లాస్‌లో కాపురం సాగించాక హోం సిక్ పేరుతో ఇంటికి వచ్చిన శ్రావ్య తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. సుమారు ఏడాది గడిచినా నవీన్‌రెడ్డి శ్రావ్యను తీసుకెళ్లకపోవడంతో ఆమె తల్లిదండ్రులు ఈనెల 19న ఇల్లెందు పోలీసులను ఆశ్రయించగా సీఐ సత్యనారాయణ, షీం టీం సభ్యులు ఈ వివాదాన్ని పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తమను స్టేషన్‌కు పిలిచి శ్రావ్య కుటుంబసభ్యుల సమక్షంలో సీఐ బెదిరించారని నవీన్‌రెడ్డి తల్లిదండ్రులు ఉప్పల్‌రెడ్డి, పద్మజ ఐజీకి ఫిర్యాదు చేయడంతో సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు పడింది.

ఖమ్మం అదనపు డీసీపీ విచారణ..
సీఐ సత్యనారాయణపై ఫిర్యాదు అందగా ఐజీ ఆదేశాల మేరకు ఖమ్మం అదనపు డీసీపీ ప్రసాదరావు బుధవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో విచారణ నిర్వహించారు. నవీన్ రెడ్డి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచిన సమయంలో సీసీ పుటేజీలను పరిశీలించడంతో పాటు ఆరోజు విధుల్లో ఉన్న సిబ్బందిని విచారించారు.

పోస్టింగ్ కోసం అంతర్గత పోరు..
ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో సీఐ మార్పు జరుగుతుందని కొంతకాలంగా ప్రచారం జోరందుకుంది. దీంతో పాటు ఈ సబ్ డివిజన్‌కు చెందిన ఓ అధికారి ఇల్లెందు సీఐ పీఠంపై కన్నేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే సత్యనారాయణను తప్పించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఎన్ఆర్ఐ కేసు ముందుకు రావడంతో అతడి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేశాడంటూ ఐజీకి ఫిర్యాదు చేయడం, సీఐపై సస్పెన్షన్ వేటు పడడం చర్చనీయాంశంగా మారింది.

నా భర్త నుంచి న్యాయం చేయండి



ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న శ్రావ్య, ఆమె తల్లిదండ్రులు

పెద్దల సమక్షంలో అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకుని అమెరికాకు తీసుకెళ్లిన ఏడాదికే తిరిగి ఇంటికి పంపించి తన జీవితంతో ఆడుకుంటున్న ఎన్ఆర్ఐ నవీన్‌రెడ్డి నుంచి న్యాయం చేయాలంటూ శ్రావ్య పోలీసులను కోరారు. తన తల్లిదండ్రులు దుబ్బాక వేణుగోపాల్‌రెడ్డి, శ్రీలతతో కలిసి బుధవారం ఆమె ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ వివాదంపై మాట్లాడేందుకు తమను సీఐ రమ్మని చెప్పడంతోనే తాము ఇక్కడికి వచ్చామని తెలిపారు. అమెరికాలో ఉన్న రోజుల్లో తనకు సమాచారం ఇవ్వకుండానే పలువురు డాక్టర్లతో కొన్ని పరీక్షలు చేయించాడని, ఆ తర్వాత వీసా గడువు ముగిసిందంటూ ఇంటికి పంపించాడని తెలిపారు. 2025లో మళ్లీ వీసా వచ్చినా రద్దు చేయించాడని, ఈ విషయం అడిగితే దురుసుగా సమాధానం ఇస్తున్నాడని, దీంతో తాను పోలీసులను సంప్రదించానని వివరించారు.

925 మందికి కార్డుల పంపిణీ

ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాలకు చెందిన ఏడు గ్రామాల్లో 925 మంది గిరిజనులకు వివిధ గుర్తింపు కార్డులు పంపిణీ చేశామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ అభాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ యోజన పథకాల నమోదు క్యాంపుల ప్రక్రియ ముగిసిందని, బూర్గంపాడు, చర్ల, పాల్వంచ, సుజాతనగర్, ఆళ్లపల్లి, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లో సదస్సులు నిర్వహించామని వివరించారు. ఆయా గ్రామాల గిరిజనులకు పీఎం కిసాన్, ఆధార్, ఆయుష్మాన్ భారత్ కార్డులతో పాటు కుల ధ్రువీకరణ తదితర పత్రాలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్డులు గిరిజనులకు అనేక రకాలుగా ఉపకరిస్తాయని, వాటిని జాగ్రత్తగా ఉంచాలని పీఓ సూచించారు.

క్లుప్తంగా

'శానిటరీ కాంప్లెక్స్' పూర్తి చేయాలి



శానిటరీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచరూరల్: పక్షం రోజుల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన ఆదేశించారు. మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ సముదాయంలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఈ ఏడాది రూ.3 లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్వహిస్తున్నారు. ఆలయ ఈఓ పర్యవేక్షణలో పనులు కొనసాగుతుండగా, నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నట్లు సమాచారం రావడంతో ఆమె బుధవారం తనిఖీలు నిర్వహించారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఆలయ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ఎస్బీఎం కన్సల్టెంట్ రేవతి పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ.. ఒకరు మృతి



మనోజ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శిల్పినగర్‌లో బుధవారం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ప్రమాదవశాత్తు ఓ యువకుడు ట్రాలీ ఆటో కింద పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం శిల్పినగర్‌లోని ఓ దుకాణం వద్ద తెప్పల మనోజ్ (18)కు, నాగేంద్రకు మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పరస్పరం దాడి చేసుకున్నారు. కాగా, నాగేంద్ర తాను పని చేస్తున్న కంపెనీ ట్రాలీ ఆటోలో ఎక్కుతుండగా, నాగేంద్రను కిందకు లాగే ప్రయత్నంలో మనోజ్ కింద పడిపోయాడు. ఈ క్రమంలో ట్రాలీ ఆటో వెనుక టైరు మనోజ్ తల మీదుగా పోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి కల్యాణ్ ఫిర్యాదు మేరకు నాగేంద్రతోపాటు ట్రాలీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు భద్రాచలం పోలీసులు తెలిపారు.

ఇద్దరు వైదిక సిబ్బందికి షోకాజ్ నోటీసులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వైదిక సిబ్బందికి దేవాదాయ శాఖ అధికారులు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో జరిగిన గ్రూప్ చర్చల్లో దేవస్థానంలో భక్తులు అర్చకులకు సమర్పించే కానుకలు తమకే చెందుతాయంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశా రు. ఈ విషయం ఆలయ అధికారులకు తెలి యడంతో పూర్తి వివరణతో కూడిన నివేదికను రెండు రోజుల్లో అందించాలని షోకాజ్ నోటీసులు అందజేశారు. లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెట్రోల్‌బంక్ నిర్వహణపై విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఓ పెట్రోల్ బంక్ నిర్వహణపై వినియోగదారులు ఫిర్యాదు చేయడంతో డీసీఎస్ఓ రుక్మిణి బుధవారం విచారణ చేపట్టారు. వినియోగదారుల వాంగ్మూలం రికార్డు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. నిర్వహణ వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండాలని బంక్ నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ ఎస్వో వరదరాజులు, సివిల్ సప్లయీస్ డీటీ రాజు, ఆర్ఐ కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆ నేరం మాది కాదు!



మిషన్ భగీరథ కార్యాలయం



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

- ఇల్లెందు పట్టణంలో తరచూ తాగునీటి సమస్య
- నీరు సరిపడా, సకాలంలో రావడంలేదు : మున్సిపల్ శాఖ
- వారే సకాలంలో ట్యాంకులకు ఎక్కించడంలేదు: మిషన్ భగీరథ
- రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో సమస్య తీవ్రం

ఇల్లెందు: వర్షాకాలం మొదలైనా ఇల్లెందు పట్టణవాసులకు తాగునీటి తిప్పలు తప్పడంలేదు. గత జనవరి నుంచి మూడు, నాలుగు రోజులకోసారి, అదికూడా అరగంటపాటే సరఫరా చేస్తున్నారు. వారం రోజుల క్రితం నాలుగు రోజులపాటు పట్టణంలో నీటి కటకట ఏర్పడింది. పట్టణానికి నీటిని అందించే బాధ్యత మున్సిపాలిటీది కాగా, నీటిని ట్యాంకుల వరకు మిషన్ భగీరథ చేర్చాల్సి ఉంది. ఈ రెండు శాఖల మధ్య తీవ్ర సమన్వయ లోపంతో తరచు నీటి సమస్య ఏర్పడుతోంది. భగీరథ నుంచి సమయపాలన పాటించకుండా, అది కూడా తక్కువ సమయమే నీరు సరఫరా చేస్తున్నారని, అందుకే నీటి ఎద్దడి ఏర్పడుతోందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు సకాలంలో ట్యాంకులకు ఎక్కించుకుని ట్యాప్‌లకు సరఫరా చేయకపోవటం లేదని మిషన్ భగీరథ అధికారులు పేర్కొంటున్నారు. రెండు శాఖల అధికారులను సమన్వయం చేసే అధికారి, ప్రజాప్రతినిధి లేకపోవటంతో ప్రజలకు ఇక్కట్లు తప్పటం లేదు. మున్సిపల్ పాలకవర్గం కూడా లేకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

మూడు, నాలుగు రోజులకోసారి..

ఇల్లెందు పట్టణంలో 24 వార్డులు ఉండగా, మిషన్ భగీరథ, మున్సిపాలిటీ పరిధిలోని చెరువు, సింగరేణి నీరు సరఫరా చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం మున్సిపాలిటీ వాటర్ సప్లైలో మోటార్లు మొరాయించటంతో నీటిరు సరఫరాలో లోపం తలెత్తింది. తోగ్గూడెంలోని మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌లో మరమ్మతుల కారణంగా సక్రమంగా నీరు అందడంలేదు. దీంతో నాలుగు రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది.

అసంపూర్తిగా భగీరథ పనులు

ఇల్లెందులో మిషన్ భగీరథ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ట్యాంకుల నిర్మాణం నుంచి మొదలుకుని పైపులైన్లు, నల్లాలు అన్ని అసంపూర్తిగానే వదిలేశారు. మెయిన్ లైన్, సబ్‌లైన్లు, ఇంటింటికీ నల్లాలు కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. కొన్ని వీధుల్లో పైపులైన్లు లీకవుతున్నాయి. పట్టణంలో ఐదు వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఉండగా, వీటన్నింటికీ భగీరథ పైపులైన్ల అనుసంధానం చేయలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తాగునీటి సమస్య తలెత్తుతోంది.

బొగ్గుట్టను వెంటాడుతున్న నీటి సమస్య

జిల్లాలో ఇల్లెందు పట్టణాన్ని నీటి సమస్య వెంటాడుతోంది. పట్టణ బృహత్తర తాగునీటి సరఫరా పథకం ఉన్నా ప్రజల దాహార్తి తీరడం లేదు. 2020 డిసెంబర్ నుంచి రూ. 31.06 కోట్లతో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ మిషన్ భగీరథ(అర్బన్) పనులు చేపట్టారు. ఇప్పటికీ పనులు 100శాతం పూర్తి కాలేదు. కోర్టు ఏరియాలో వాటర్ ట్యాంకు నిర్మాణం ఇంకా సాగుతూనే ఉంది. భగీరథ నీటిని 9,10, 14,15, 22, 23 వార్డులకు సరఫరా చేస్తుండగా, సింగరేణి నీటిని 12,13,14 22, 23 వార్డులకు అందిస్తున్నారు. నంబర్-2 బస్తీ, ఎల్‌బీఎస్ నగర్, బస్టాండ్ ఏరియా, గుండాల రోడ్ వైపు ప్రాంతాలకు మున్సిపల్ శాఖ నిర్వహణలోని ఇల్లెందులపాడు చెరువు నుంచి సరఫరా చేస్తున్నారు.

పట్టణ ప్రజలందరికీ సరఫరా కావాలంటే 6.5 గ్యాలన్ల నీరు అవసరం ఉంది. కానీ మిషన్ భగీరథ నుంచి 4.0 గ్యాలన్ల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారు. మరో 2.5 గ్యాలన్ల కోసం చెరువు, సింగరేణి మీద ఆధారపడాల్సి వస్తోంది.

భగీరథ నీళ్లు సరిపడా రావట్లే..

మున్సిపాలిటీలో మోటార్లు రిపేరు రావటం, మిషన్ భగీరథ నుంచి రావాల్సినంత నీరు సకాలంలో రాకపోవటం వల్ల నీటి సమస్య ఏర్పడింది. మోటార్లు మరమ్మతులు పూర్తయ్యాయి. భగీరథ నుంచి నీరు సరిపడా వస్తే సమస్య తీరుతుంది.

– సీహెచ్ శ్రీకాంత్, ఇల్లెందు మున్సిపల్ కమిషనర్

సరిపడా సరఫరా చేస్తున్నాం

పట్టణానికి అవసరమైన మేర తాగునీటిని సరఫరా చేస్తున్నాం. ఇటీవల తోగ్గూడెం వద్ద భగీరథ ఫిల్టర్ బెడ్ వద్ద మరమ్మతుపనులు జరిగాయి. అప్పుడే రెండు, మూడు రోజులు సమస్య ఏర్పడింది. మిగతా రోజుల్లో సరిపడా సరఫరా చేస్తున్నాం.

–మురళీకృష్ణ, మిషన్ భగీరథ ఏఈ

ఐకేపీ అధికారులకు షోకాజ్ నోటీసులు

బూర్గంపాడు: మండల పరిధిలో స్త్రీనిధి రుణాల రికవరీలో చేతివాటం ప్రదర్శించి గోల్‌మాల్ కు పాల్పడిన వారిపై సెర్ప్ అధికారులు చర్యలు చేపట్టారు. స్త్రీనిధి రుణాల రికవరీలో అక్రమాలకు పాల్పడిన ఐకేపీ సీసీకి ఇప్పటికే రెండుసార్లు షోకాజ్ నోటీస్‌లు జారీచేశారు. ఇటీవల ఐకేపీ ఏపీఎంకు కూడా షోకాజ్ నోటీసులు జారీచేశారు. స్త్రీ నిధి రుణాల రికవరీలో రూ. లక్షలను ఐకేపీ సిబ్బంది కాజేశారని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆరోపణలు చేశారు. తాము చెల్లించిన రుణాలను బ్యాంకులో చెల్లించకుండా ఐకేపీ అధికారులు స్వాహా చేశారని ఐకేపీ కార్యాలయం వద్ద పలుమార్లు ఆందోళనలు కూడా చేపట్టారు. ఈ ఘటనపై విచారణ నామమాత్రంగా జరుగుతుందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సీసీతో పాటు ఏపీఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేయటం చర్చనీయాంశమైంది.

మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

చుంచుపల్లి: మండల పరిధిలోని హౌసింగ్ బోర్డుకాలనీలో ఓ ఇంట్లో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి చుంచుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేపట్టి మృతుడు చుంచుపల్లి తండాకు చెందిన మాళోత్ సేతురామ్(65)గా గుర్తించారు. తరుచూ మద్యం తాగుతూ గొడవ పెట్టుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోతుంటాడు. పది రోజుల క్రితం కూడా అలాగే వెళ్లి మృతదేహమై కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అడవి బిడ్డకు అనారోగ్యం..

డోలీలో ఆరు కి.మీ. మోసుకెళ్లిన కుటుంబీకులు



డోలీలో ఉంగమ్మను తీసుకొస్తున్న కుటుంబీకులు, (ఇన్‌సెట్) చికిత్స పొందుతున్న దృశ్యం

కరకగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో రహదారులు లేక అడవి బిడ్డల కష్టాలకు పరిష్కారం లభించడం లేదు. కరకగూడెం మండలంలో వలస ఆదివాసీ గ్రామమైన నీలాద్రిపేటలో ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. నీలాద్రిపేటకు చెందిన మడివి ఉంగమ్మకు బుధవారం వాంతులు, విరేచనాలు తీవ్రమై ఆరోగ్యం విషమించింది. దీంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా నీలాద్రిపేటకు సరైన రహదారి లేక వాహనం వచ్చే పరిస్థితి కనిపించలేదు. దీంతో వైద్యంలో జాప్యం జరుగుతుందని భావించిన ఉంగమ్మ భర్త జోగయ్య, తదితరులు డోలీ కట్టి ఆమెను అటవీ మార్గంలో బురద, ఎగుడుదిగుడు మార్గంలో ఆరు కి.మీ. మేర మోస్తూ రెండు గంటల అనంతరం అశ్వాపురంపాడు మీదుగా మోతె సమీపంలోని ప్రధాన రహదారి వద్దకు చేర్చారు. అక్కడ సిద్ధంగా ఉన్న 108లో ఉంగమ్మను మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన కోరం



డిప్యూటీ సీఎంకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని, విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వినతి పత్రం అందజేశారు. బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంను కలిసి సమస్యలు వివరించారు. చెరువులకు మరమ్మతులు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి ఉన్నారు.

ఫిట్‌నెస్‌లేని మూడు బస్సులు సీజ్



ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన బస్సులు

ఇల్లెందు: పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన మూడు బస్సులను సీజ్ చేశారు. బుధవారం ఇల్లెందు పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.నిర్మల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇల్లెందు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులతో కళాశాలకు వస్తుండగా జేకే బస్టాప్ సమీపంలో తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ లేని కారణంగా మూడు బస్సులను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కొంత కాలంగా పట్టణంలో పలు కళాశాలలు, పాఠశాలలకు చెందిన బస్సులను ఫిట్‌నెస్ లేకుండా తిప్పుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆర్టీఓ అధికారులు విద్యాసంస్థల బస్సులను తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ఇతర సంస్థల బస్సులను కూడా తనిఖీ చేస్తామని ఇన్‌స్పెక్టర్ నిర్మల తెలిపారు.

శంకుస్థాపన శిలాఫలకం ధ్వంసం



వంతెన శంకుస్థాపన శిలాఫలకం పగులగొట్టిన దృశ్యం

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువులో లోతువాగుపై వంతెన శంకుస్థాపన శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. హైలెవల్ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.3 కోట్లు మంజూరు కాగా అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికలు రావడంతో పనులు చేపట్టలేదు. నూతన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ తీసుకొని వంతెన పనులు పూర్తి చేయించారు. బుధవారం ఎమ్మెల్యే పాయం వంతెనను ప్రారంభించనుండగా, మంగళవారం రాత్రి శంకుస్థాపన శిలాఫలకం పగులగొట్టారు. రేగా కాంతారావు పేరు ఉండకూడదని కాంగ్రెస్ శ్రేణులు ధ్వంసం చేశాయని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తుండగా, బీఆర్ఎస్ పార్టీ వాళ్లే ప్రచారం కోసం ధ్వంసం చేశారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ఫిర్యాదుతో సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీవీకే-5 ఇంక్లైన్‌లో కేబుల్ అపహరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 ఇంక్లైన్ గని ప్యాన్ ఆవరణలోని కాపర్ కేబుల్ చోరీ జరిగిన విషయం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. కొత్తగూడెం ఏరియాలోని మాజీ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు ఈ నెల 23న మృతి చెందగా, 24న అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ క్రమంలో సెక్యూరిటీ సిబ్బంది దిగ్భ్రాంతికిలోనై అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఈ నెల 23, 24 రెండు రోజుల్లో కాపర్ కేబుల్‌ను ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాల ఫుటేజీలో నిక్షిప్తమైంది. సుమారు 10 మీటర్ల కేబుల్ చోరీకి గురైందని సిబ్బంది చెబుతుండగా, విచారణలో పూర్తి వివరాలు తేలాల్సి ఉంది. ఈ విషయమై సింగరేణి కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్‌ను వివరణ కోరగా.. చోరీ చేసినవారిని గుర్తించామని, గురువారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

తాటి మొద్దును ఢీకొట్టిన కారు

మంటలు చెలరేగి ఇంజన్ దగ్ధం

ములకలపల్లి: రోడ్డు ప్రమాదానికి గురైన కారులో మంటలు చెలరేగి ఇంజన్ దగ్ధమైన సంఘటన బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో కారులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులకథనం ప్రకారం.. వరంగల్ పట్టణానికి చెందిన డేవిడ్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో అమలాపురం వెళుతున్నాడు. ఈ క్రమంలో మండలపరిధిలోని మధారం శివారులో కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లి అక్కడున్న తాటి మొద్దును ఢీకొట్టింది. దీంతో కారు ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఘటనాస్థలికి చేరుకుని ప్రయాణికులను వాహనంనుంచి క్షేమంగా బయటకు దింపారు. సమీప పెట్రోల్ బంక్‌లో ఉన్న ఫైర్ సేఫ్టీ సిలిండర్లతో, స్థానికులు సమీప ప్రాంతాల నీళ్లు తెచ్చిపోయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఈలోగా కొత్తగూడెం నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పేశారు. ప్రమాదంలో కారు ఇంజన్ పూర్తిగా కాలిపోయింది.

వరకట్న వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యను వేధిస్తున్న భర్తపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడేనికి చెందిన ఆవుల చిన్ని 13 ఏళ్ల క్రితం ఏపీలోని ఏలూరు జిల్లా బుట్టాయిగూడేనికి చెందిన జ్యోతిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా, గడిచిన రెండేళ్లుగా మద్యం తాగుతూ వరకట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో చిన్నిపై వరకట్న వేధింపులతోపాటు గృహహింస చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యంపై..

పాల్వంచరూరల్: బాలిక అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలానికి చెందిన మైనర్ బాలిక హైదరాబాద్‌లో 8వ తరగతి చదువుతోంది. 20 రోజుల క్రితం బంధువుల ఇంటికి వచ్చింది. మంగళవారం అక్కడి నుంచి అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.సురేష్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు: క్షణికావేశంలో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సారపాకలోని గాంధీనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తాళ్లగొమ్మూరుకు చెందిన వట్టం కార్తీక్(26) కొంతకాలంగా భార్య జ్యోతితో కలిసి సారపాకలోని గాంధీనగర్‌లో నివాసముంటున్నాడు. ప్రేమ వివాహం చేసుకున్న వీరు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో ఇంట్లో రోజు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కార్తీక్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా వైద్యసేవలు

- భద్రాచలం ఏజెన్సీలో ఇష్టారాజ్యంగా క్లినిక్‌ల నిర్వహణ
- స్థాయికి మించి చికిత్స అందిస్తున్న కొందరు ఆర్ఎంపీలు
- చర్యలు తీసుకోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు



భద్రాచలం పట్టణంలోని ఓ ఆర్ఎంపీ క్లినిక్‌లో పరిధికి మించి వైద్యం చేస్తున్న యువతి

భద్రాచలంఅర్బన్: ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తూ, మోతాదుకు మించి మందులు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాల్సిన వారు క్లినిక్‌లలో పడకలు ఏర్పాటు చేస్తూ, ల్యాబ్‌లు నిర్వహిస్తూ నిబంధనలను కాలరాస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం భద్రాచలంలో పలువురు అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఇటీవల భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఆర్ఎంపీలు పరిధి దాటి చేయకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అయినా వైద్యారోగ్యశాఖ అధికారుల్లో చలనం లేదు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలో సుమారు 40 మంది వరకు ఆర్ఎంపీలు ఉన్నారు. ప్రథమ చికిత్స కేంద్రానికి ఎలాంటి పేరు పెట్టకూడదు. అతని పేరు కూడా డాక్టర్‌గా రాసుకోకూడదు. కట్లు కట్టడం, సెలైన్లు ఎక్కించడం, ఇంజెక్షన్లు వేయడం, వైద్య పరీక్షలకు సిఫారసులు, వంటివి చేయకూడదు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు వైద్యం అందించొద్దు. కానీ కొందరు ఆర్ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం పేరుతో రోగుల నుంచి సొమ్ము దండుకుంటున్నారు.

పట్టించుకోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు

ఏజెన్సీ ప్రాంతాల్లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలకు, ఇతర వ్యాధులకు ఆర్ఎంపీలు వైద్యం చేస్తున్నారు. భద్రాచలం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు, రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై బిల్లుల్లో కమీషన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో జిల్లాలో ఆర్ఎంపీల వైద్యం వికటించి పలువురు మృతి చెందిన సంఘటనలు సైతం ఉన్నాయి. కానీ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆర్ఎంపీల క్లినిక్‌లను తనిఖీలు చేయడంలేదు. కొందరు అధికారులు మామూళ్లకు అలవాటు పడి వారిని వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అధిక మోతాదులో మందులు ఇస్తూ..

గ్రామాల్లో, బస్తీల్లో జ్వర బాధితులు సాధారణంగా ఆర్ఎంపీల వద్దకే వెళ్తుంటారు. వారు పెయిన్ కిల్లర్, స్టెరాయిడ్ వంటి మందులను ఇస్తూ, త్వరగా నయం చేస్తున్నట్లు నమ్మిస్తున్నారు. దీంతో ప్రజలు వారి వద్దే చికిత్స పొందుతున్నారు. ఆ మందులు వాడితే అనంతరం కాలంలో వచ్చే అనారోగ్య సమస్యలు వస్తాయనే అవగాహన ప్రజల్లో లేదు. అవగాహన కల్పించే దిశగా అధికారులూ చర్యలు చేపట్టడంలేదు. మందుల ద్వారా ఇచ్చే స్టెరాయిడ్స్ అధిక మోతాదులో ఉండటం వల్ల జీవక్రియ దెబ్బతింటోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలికంగా వాడితే జబ్బులు కోరి తెచ్చుకుంటున్నట్లేనని పేర్కొంటున్నారు. బీపీ, స్థూలకాయం, ఎముకల బలహీనత, కంట్లో శుక్లాలు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. అంతకు మించి మించి వైద్యం చేయొద్దు. రోగుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాస్పత్రి లేదా ఎంబీబీఎస్ డాక్టర్‌కు రెఫర్ చేయాలి. ఆర్ఎంపీలు ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ, భద్రాచలం